
సాక్షి ఒడిశా
శనివారం । 27 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,01,948
బంగారం	50 మిల్లీ గ్రాములు
వెండి	80 గ్రాముల 100 మిల్లీ గ్రాములు


– భువనేశ్వర్/పూరీ



జన గళమున జనగణమన

రాష్ట్రవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

- 8లో▸



ప్రాణాలు తీసిన అతివేగం

మితిమీరిన అతివేగం ముగ్గురు ప్రాణాలను బలి కొన్న ఘటన జయపురం సబ్ డివిజన్ బిజాపూర్ ఘాట్ రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది.

- 8లో▸

సమష్టిగా సరికొత్త శకం నిర్మిద్దాం



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ రఘుబర దాస్

- గవర్నర్ రఘుబర్ దాస్
- వైభవంగా రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలు
- ఆకట్టుకున్న సైనిక విన్యాసాలు



చిన్నారులకు మిఠాయిలు అందజేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



కవాతులో పాల్గొన్న బృందాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో సమష్టి కృషితో సరికొత్త శకం నిర్మిద్దామని గవర్నర్ రఘుబర్ దాస్ పిలుపునిచ్చారు. నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర వీర పుత్రులకు, రాజ్యాంగ నిర్మాతలకు, స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులర్పించారు. రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం జగన్నాథుని సంస్కృతి సర్వమత సమభావానికి ప్రతీక అన్నారు. ఒడిశా శాంతి, స్నేహాల భూమిగా పేరుగాంచిందని పేర్కొన్నారు. మనమంతా కలిసి అభివృద్ధి చెందిన ఒడిశాను నిర్మించుకుందామని తెలియజేశారు. ఐపీఎస్ అధికారి ఏబీ శిల్ప నేతృత్వంలో జరిగిన పరేడ్‌లో గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. ఐటీబీపీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, అగ్నిమాపకం, ఒడ్రాఫ్, ఒడిశా హోంగార్డ్, రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) మరియు సైనిక్ స్కూల్ పోలీసు బ్యాండ్‌తో కూడిన 64 వర్గాలు రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ కవాతులో పాల్గొన్నాయి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

బాలలు భారత రూపకర్తలు: సీఎం నవీన్

బాలలు భావి భారత రూపకర్తలని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. స్థానిక నవీన్ నివాస్ ఆవరణలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పిల్లలతో కలిసి వేడుకలు చేసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

రాష్ట్రస్థాయి గణతంత్ర వేడుకల్లో స్థానిక మహాత్మ గాంధీ పార్కు రంగస్థలంగా తళుక్కుమంది. రాష్ట్రంలోని ప్రముఖ కళలు, సంస్కృతి, సంప్రదాయ విలువలతో కూడిన ప్రదర్శనల్లో పలువురు కళాకారులు పాలుపంచుకున్నారు. నాలుగు సాంస్కృతిక బృందాలు ప్రదర్శించిన ధింసా, గంజాం జోడు శంఖ ధ్వని, పూరీ సాహి జాతర, సంబల్‌పురి నృత్య ప్రదర్శనలు కనువిందు చేశాయి. ఒడిశా స్కేటింగ్ అకాడమీ బృందం స్కేటింగ్ విన్యాసాలు, జాంబాజ్ జవాన్ బృందం డేర్ డెవిల్స్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి. జార్ఖండ్ పోలీసులు కూడా రిపబ్లిక్ డే పరేడ్‌లో అతిథి కంటింజెంట్‌గా చేరారు.

ప్రభుత్వ పథకాల శకటాలు

ఒడిశా ప్రభుత్వంలోని వివిధ శాఖలు 12 శకటాలను ప్రదర్శించాయి. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం , పంచాయతీరాజ్, తాగునీరు, పనుల శాఖ, చేనేత, జౌళి, హస్తకళల శాఖ, పర్యాటక, ఓఎస్ఏపీఎస్, ఓఎంసీ, అగ్నిమాపక శాఖ వంటి ప్రభుత్వ శాఖలు శకటాలను ప్రవేశపెట్టాయి. ఆయా శాఖల విజయ గాథలు ఈ శకటాలు ప్రదర్శించడం విశేషం.



జాంబాజ్ జవాన్ బృందం డేర్ డెవిల్స్ ప్రదర్శన



గంజాం జోడు శంఖ ధ్వని విన్యాసం



సైనిక్ స్కూల్ ప్రతినిధుల బ్యాండ్ కవాతు



పంచాయతీ రాజ్ శాఖ అమొ బ్యాంకు పథకం శకట ప్రదర్శన



ధింసా గిరిజన నృత్య ప్రదర్శన



పూరీ సాహి జాతర ప్రదర్శన

న్యూస్‌రీల్

ఓటును అమ్ముకోవద్దు

- అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్ర



సైకిల్‌పై యాత్ర చేపడుతున్న చిన్నారావు

కొరాపుట్: ఓటు వజ్రాయుధమని, దానిని అమ్ముకోవద్దని అవగాహన కల్పిస్తూ కొరాపుట్ జిల్లా సిమిలిగుడకి చెందిన షావుకార్ చిన్నారావు సైకిల్ యాత్ర ప్రారంభించారు. సిమిలిగుడ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వరకు ఈ యాత్ర కొనసాగనుంది. మద్యం, మాంసం, డబ్బుకి లొంగిపోయి ఓటు విక్రయించవద్దని హితవు పలికారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ నిజాయితీగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కాగా చిన్నారావు వయసు 60 ఏళ్లు కావడం విశేషం. ఆయన గతంలోనూ చాలా అభ్యుదయ ప్రచారాల కోసం సైకిల్ యాత్ర, పర్వతారోహణ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

నబరంగ్‌పూర్‌లో 'ఇంటింటా శంఖం'



శంఖం స్టిక్కర్ అతికిస్తున్న ఎంపీ రమేష్ మజ్జి తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఇంటింటా శంఖం కార్యక్రమం ప్రారంభమయ్యింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బీజూ జనతాదళ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రిస్టియన్ పేటలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రతి ఇంట్లో ఉన్నవారి అనుమతితో ఇంటి ముందు శంఖం గుర్తు స్టిక్కర్ అతికించారు. తమకు అందుతున్న పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, పార్టీ పరిశీలకుడు దేవాశిష్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న దీక్షిత్

రాయగడ: ట్రయిల్ రన్ రైలు ఢీకొన్న ఘటనలో చందిలి పోలీసుస్టేషన్ పరిధి దేవదల్‌గుడ గ్రామానికి చెందిన ఇద్దరు ఆదివాసీ యువకులు బుధవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయా కుటుంబాలకు రైల్వే శాఖ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. సింగుపూర్ రోడ్డు స్టేషన్ మధ్య కొత్తగా నిర్మించిన రైల్వే మూడోలైన్‌లో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో దేవదల్‌గుడకు చెందిన అనీస్ రావు, శివమ్ కద్రకలు దుర్మరణం పాలయ్యారు. ఆయా కుటుంబాలకు ఆర్థిక సహకారాన్ని అందించాలని గ్రామస్తులు పట్టుబట్టడంతో, స్పందించిన రైల్వే శాఖ ఒక్కొక్క కుటుంబానికి రూ.1.75 లక్షల చెక్కును శుక్రవారం అందించింది. కార్యక్రమంలో రైల్వే ఏడీఈఎన్ సంజీవ్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ కళలను పరిరక్షించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



వివిధ వేషధారణల్లో కళాకారులు

జయపురం: మన ప్రాచీన ఆదివాసీ కళలు, సంస్కృతులను పరిరక్షించడమే పుష్పుని ఉత్సవాల లక్ష్యమని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పుష్పుని-24 ఉత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కళలకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. కొరాపుటియ కళ, కళాకార గ్రూపు కార్యదర్శి ధిరెన్ మోహనపట్నాయక్ మాట్లాడుతూ.. 2020లో ఈ ఉత్సవాలను ప్రారంభించామని, కరోనా సమయంలో రెండేళ్లు జరపలేకపోయామని వెల్లడించారు. ఈనెల 31వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయని వెల్లడించారు. ప్రజలు కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఉత్సవాల్లో పల్లెశ్రీ మేళా, ఫుడ్ ఫెస్టివల్ తదితర స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొరాపుటియ కళ, కళాకార గ్రూపు అధ్యక్షుడు మనోజ్ కుమార్ పాత్రో పాల్గొన్నారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



భారీగా స్వాధీనం చేసుకున్న నాటుసారా తయారీ సామగ్రి



శశిఖాల్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రాయగడ: ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో ఎక్సైజ్ శాఖ గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 1,170 లీటర్ల నాటుసారా, 8,550 లీటర్ల బెల్లం ఊటను అధికారులు స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసులు నమోదు చేశారు. జిల్లా అబ్కారీ శాఖ అధికారి అభిరాం బెహర తెలిపిన వివరాల మేరకు.. సరిహద్దుల్లో నాటుసారా తయారీ, అక్రమ రవాణా జోరుగా సాగుతోందనే సమాచారంతో కెరడ, మెట్టుకెరడ, చిన్నపెడుము తదితర ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించామన్నారు. అదేవిధంగా శశిఖాల్ పోలీసుస్టేషన్ పరిధి సరిహద్దు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. భారీ ఎత్తున నాటుసారాతో పాటు తయారీకి వినియోగించే సామగ్రి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మాసమలై ప్రారంభోత్సవానికి సేవాయత్‌లు



సేవాయత్‌ల ప్రయాణానికి జెండా ఊపుతున్న అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్

పర్లాకిమిడి: ఈనెల 27వ తేదీన సంబల్‌పూర్‌లో వెలిసిన మాసమలై అమ్మవారి మందిర పరిక్రమ ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరగనుంది. దీనిలో భాగంగా గజపతి జిల్లా నుంచి ఐదుగురు సేవాయత్‌లను ఒక ప్రత్యేక వాహనంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ పంపించారు. సంబల్‌పూర్‌కు వెళ్లిన వారిలో సేవాయత్‌లు చిత్రసేన్ నాయక్, హారికార్జి, చంద్రగిరి జగన్నాథ మందిరం సేవాయత్ రామచంద్ర పూజారి, బసంత్ కుమార్ ప్రధాన్, రామగిరి మాకురేసిని మందిరం నుంచి పూర్ణచంద్ర రౌత్, కుంజబిహారీ బోడోనాయక్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి కుమారి అర్చనా మంగరాజ్‌లు ఉన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్ పతాకాన్ని ఎగురవేశారు.

• వైభవం.. సాగర సంబరం

గోపాల్‌పూర్ తీరంలో వైభవంగా సాగర సంబరాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయిలు ప్రారంభ జ్యోతిని వెలిగించారు. కళలు, కళాకారులకు గంజాం జిల్లాలో ప్రత్యేక స్థానం ఉందని తెలియజేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. జానపద నృత్యాలు, ఆదివాసీ నృత్యాలు, ఆధునిక నృత్యాలు అలరించాయి.

– బరంపురం



వేదికపై ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు



బీచ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న సందర్శకులు





ఆకట్టుకుంటున్న జానపద నృత్య ప్రదర్శన





అలరిస్తున్న ఒడిస్సీ నృత్యం



గోపాల్‌పూర్ లైట్ హౌస్

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న పాత్రికేయులు

రాయగడ: ఇటీవల మరణించిన ఒడియా టీవీ జర్నలిస్ట్ గజమోహన్ గరాడియా(36) కుటుంబాన్ని ఆదుకునేందుకు పాత్రికేయులు ముందుకొచ్చారు. దీనిలో భాగంగా పాత్రికేయులంతా కలిసి సేకరించిన రూ.75 వేలను కల్యాణ సింగుపూర్‌లో నివసిస్తున్న మోహన్ సతీమణి యశోదకు శుక్రవారం అందజేశారు. మోహన్ పాత్రికేయ రంగంలో చేసిన సేవలను ఎన్నటికీ మరువలేనివన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు నిరంజన్ పాలో, బాదల్ కుమార్ ఝా, రంజన్ కుమార్ రౌథొ, సంతోష్ కుమార్ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి పతకాలు ప్రదానం



పతకాలు అందుకున్నవారితో గవర్నర్ రఘుబర దాస్, సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవలందించిన రాష్ట్ర పోలీసులు, అగ్నిమాపక దళం, సివిల్ డిఫెన్స్, హోంగార్డు, జైలుకు చెందిన 50 మంది సిబ్బందికి రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ శుక్రవారం పతకాలు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి పతక ప్రదానోత్సవ కార్యక్రమంలో మావోయిస్టుల అణిచివేతలో విజయవంతమైన 3 మంది స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపు (ఎస్ఓజీ), డీవీఎఫ్ నుంచి ఒకరికి శౌర్య పోలీసు పతకం ప్రదానం చేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. విశిష్ట సేవలు ప్రదర్శించిన ఇద్దరు సిబ్బందికి రాష్ట్రపతి పోలీసు పతకాలు, 11 మందికి పోలీసు ప్రతిభా పతకాలు, 22 మందికి గవర్నర్ పతకాలు, ఒకరికి అగ్నిమాపక సేవా శౌర్య పతకం, ఇద్దరు అగ్నిమాపక సిబ్బందికి అగ్నిమాపక ప్రతిభా పతకం, ముగ్గురికి హోంగార్డు, సివిల్ డిఫెన్స్ పతకాలు అందజేశారు. 5 మంది సిబ్బందికి కరెక్షనల్ సర్వీస్ విశిష్ట పతకం అందజేశారు.

'దివ్యాంగులను ఆదుకుంటాం'



మాట్లాడుతున్న ట్రస్టు వ్యవస్థాపకులు

నరసన్నపేట: దివ్యాంగులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి వారిని ఆదుకుంటామని గురుదేవ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు జగదీశ్వరరావు అన్నారు. మండలం తామరాపల్లి సమీపంలోని స్పిన్నింగు మిల్లు ప్రాంతంలో దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు సరఫరా చేసేందుకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 400 మందికి పైగా దివ్యాంగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి ఏయే పరికరాలు అవసరం, వారి జీవనోపాధికి ఎలాంటి సాయం అవసరమో రికార్డు చేశారు. ఎస్.కోట వద్ద మంగళపాలెంలో తమ ట్రస్టు ఉందని అన్నారు. 2005 నుంచి దివ్యాంగులను ఆదుకుంటున్నామని, 2018 నుంచి సేవలు విస్తృతం చేశామని తెలిపారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన ఏ పరికరం అయినా ఉచితంగా ఇస్తామని, ఆర్థిక స్థోమత కలిగిన వారు 50 శాతం డబ్బులు పెట్టుకోగలిగితే మరింత నాణ్యమైన పరికరాలు ఇస్తామన్నారు. ఈ నిధులు మిగిలిన దివ్యాంగుల పరికరాల తయారీకి ఉపయోగపడతాయన్నారు. ఊణ్ణ సాయి కుమార్, దాసరి ఆదినారాయణ, ఇట్రాజు హరి, పట్ట చిన్నబాబు, శ్రీనువాసు తదితరులు సహకారంతో సమావేశం నిర్వహించారు.

చిన్నారులకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామం కొత్త వీధికి చెందిన వెంకటలక్ష్మి ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఇద్దరు కుమార్తెలు శరణ్య, లిఖిత అనాథలుగా మిగిలారు. వీరిని దాతలు ఆదుకోవాలని 'సాక్షి'లో 'అమ్మలేదు–నాన్న రాడు' శీర్షికతో ప్రచురించిన కథనానికి దాతలు స్పందించారు. శుక్రవారం మండలానికి చెందిన కార్మిక శాఖ ఫౌండేషన్ రూ. 12వేలు నగదుతో పాటు దశదిన కర్మలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందజేశారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన 'స్పందన చెల్లించే హృదయం ఫౌండేషన్ తరపున రూ. 6000 నగదును సర్పంచ్,వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.



చిన్నారులకు నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం



భువనేశ్వర్: గౌరవ వందనం స్వీకరిస్తున్న ఈకో రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ



బరంపురం: గాంధీనగర్‌లో వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



బరంపురం: గౌరవ వందనం స్వీకరిస్తున్న ఆర్డీసీ ఆపాంగా ఆవో తదితరులు



బరంపురం: గణతంత్ర వేడుకల్లో కవాత్ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

జన గళమున జనగణమన

- వైభవంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



మల్కన్‌గిరి: విద్యార్థినుల ఒడిస్సీ నృత్య ప్రదర్శన

రాష్ట్రవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకోవాలని వక్తలు సూచించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలతో బాలబాలికలు ఆకట్టుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



రాయగడ: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



మల్కన్‌గిరి: సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు



రాయగడ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సింగ్



కొరాపుట్: అవార్డులు అందజేస్తున్న హోం మంత్రి తుషార్ కాంతి బెహారా



పర్లాకిమిడి: దేశభక్తి గీతానికి సత్యసాయి విద్యార్థుల నృత్యం



పర్లాకిమిడి: కవాతు చేస్తున్న బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు



పర్లాకిమిడి: సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే సదాశివ ప్రధాని



పూరీ సాగర తీరంలో సైకత శిల్పి సుదర్శన పట్నాయక్ ఆవిష్కరించిన శిల్పం



పర్లాకిమిడి: వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ స్మృతి రంజన్ తదితరులు



మల్కన్‌గిరి: మహిళకు చీర అందజేస్తున్న ఎస్పీ నితీష్



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ కమలోచన్ తదితరులు



బరంపురం: జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



కొరాపుట్: పొట్టంగిలో జెండా ఎగురవేస్తున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క



మల్కన్‌గిరి: స్వాభిమాన్ ఏరియాలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎస్పీ నితీష్ వాద్వానీ



మల్కన్‌గిరి: గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్



రాయగడ: విద్యార్థుల విన్యాసాలు

ప్రాణాలు తీసిన అతివేగం

- బిజాపూర్ ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- బైక్, ఆటోను ఢీకొన్న కారు
- ప్రమాదంలో ముగ్గురు మృతి
- 12 మందికి తీవ్రగాయాలు



లోయలో పడిన కారు



బొరిగుమ్మ ప్రాంతంలో ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు

జయపురం: మితిమీరిన అతివేగం ముగ్గురు ప్రాణాలను బలికొన్న ఘటన జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి బిజాపూర్ ఘాట్ రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. మరణించిన వారిలో ఇద్దరు మహిళలు కాగా, ఒక పురుషుడు ఉన్నారు. ప్రమాదంలో మరో 12 మంది తీవ్రంగా గాయపడగా వారిని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం జగదల్‌పూర్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం ఒక కారు బొరిగుమ్మ వైపు వస్తూ, బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి కూడలి ఘాట్ రోడ్డులో ఒక బైక్‌ను ఢీకొంది. అలాగే అదే వేగంతో వెళ్లి మరలా ఆటోను ఢీకొంది. అనంతరం ఆ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కోట్‌పాడ్‌కు చెందిన బైక్ నడుపుతున్న వ్యక్తి కృష్ణచంద్ర పట్నాయక్, ఆటోలో వెళ్తున్న బొయిపరిగుడకు చెందిన పద్మిణి బెనియ, పద్మ భొత్రలు మృత్యువాత పడ్డారు.

నలుగురు పరిస్థితి విషయం

అలాగే ఆటోలో పయనిస్తున్న మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో కొరాపుట్ సహిద్ లక్ష్మణ్ నాయిక్ ఆస్పత్రికి తరలించారు. మిగతావారు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కారు డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కారు తనిఖీ చేయగా అందులో మద్యం బాటిళ్లు ఉన్నట్టు గుర్తించారు. కారులోని నలుగురు వ్యక్తులను ప్రజలు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కారుని సీజ్ చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించాలని ఆ ప్రాంత ప్రజలు, మృతుల బంధువులు రాస్తారోకో చేపట్టారు.



సీసీ టీవీ పుటేజీలో బైక్‌ను ఢీకొంటున్న కారు దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సోంపేట: మండలంలోని పాలవలస జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు బారువ ఎస్ఐ చిరంజీవి తెలిపారు. బారువ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల మధ్య ఏదో వాహనం ఢీ కొట్టడంతో 50–60 ఏళ్ల వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని, ఉదయం ఆయనను హరిపురం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా చనిపోయారని తెలిపారు. బారువ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ విజేత జిల్లా జడ్జి జట్టు



ట్రోఫీతో జిల్లా జడ్జి షడంగి తదితరులు

రాయగడ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సెంచూరియన్ వర్సిటీ మైదానంలో రాయగడ బార్ అసోసియేషన్, జిల్లా జడ్జి జట్ల మధ్య శుక్రవారం జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో జిల్లా జడ్జి జట్టు విజేతగా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన జడ్జి జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 167 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన న్యాయవాదుల జట్టు 112 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా జిల్లా జడ్జి షడంగికి నిలిచారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సమైఖ్యతను చాటేందుకు క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవీప్రసాద్ పట్నాయక్, న్యాయవాది బాబు రాజుగురుల ఆధ్వర్యంలో మ్యాచ్ జరిగింది.



బ్యాటింగ్ చేస్తున్న జడ్జి షడంగి

క్లుప్తంగా

సెంచూరియన్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలు



సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ పీకే మహంతి, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో తొమ్మిది సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌లెన్స్ కేంద్రాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పరిశోధనలు జరపడానికి, పేటెంట్ పొందడానికి, పరిశోధన పత్రాల ముద్రణ, నూతన ఆవిష్కరణలకు ఇది ఒక మంచి వేదిక అని పేర్కొన్నారు. ఈ వేదికలో విద్యార్థులు, అధ్యాపకులు భాగస్వామ్యం కావడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్ఈబీ ఏఈఎస్‌గా జీవన్ కిశోర్



ఏఈఎస్‌గా బాధ్యతలు చేపట్టిన జీవన్‌కిశోర్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఈబీ ఏఈఎస్‌గా జీవన్ కిశోర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఆవిర్భావం తరువాత ఏఈఎస్ పోస్టును నియమించడం ఇదే మొదటిసారి. ఆరు నెలల శిక్షణ కాలం అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా ఏఈఎస్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిధిలో సారా, మద్యం అక్రమ రవాణా నిర్మూలనకు కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా మరింత పటిష్టం చేసి తనిఖీలు ముమ్మరం చేస్తామని తెలిపారు. జిల్లాకు ఒడిశా రాష్ట్ర సరిహద్దులు ఎక్కువగా ఉండడంతో ఆ రాష్ట్రంలో తయారైన సారాను దిగుమతి చేస్తున్నారని, ఈ విషయంపై దృష్టి సారించి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలలో ఇరురాష్ట్రాల అధికారులతో సంయుక్తంగా అంతర్రాష్ట్ర దాడులు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. జిల్లాలో సారాను నిర్మూలించేందుకు సిబ్బంది సహకారంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

సైనిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవం



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రిల ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో భాగంగా ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. సైనిక పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యానికి కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి దేశభక్తి, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పన్నెండో తరగతి విద్యార్థుల పాసింగ్ ఔట్ పరేడ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో సైనిక పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య



నీలంనాయుడు(ఫైల్)

సంతకవిటి: మండల పరిధిలోని పోతురాజుపేట గ్రామానికి చెందిన పోతురాజు నీలం నాయుడు(21) శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీలం నాయుడు ప్రేమవ్యవహారం వికటించిన కారణంగా మనస్తాపం చెంది మండల పరిధిలోని మిర్తివలస గ్రామంలో గల తాతగారింట్లో పురుగు మందు తాగేశాడు. గమనించి హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా మృతి చెందారని, తండ్రి అచ్యుతరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

సీఎం జగన్‌తోనే సొంతింటి కల సాకారం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన
- గుంకలాం జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం



విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎంపీ బెల్లాన, తదితరులు

విజయనగరం రూరల్: రాష్ట్రంలో 30 లక్షలకు పైగా పేదల సొంతింటి కలను నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్లలో ఒకటైన విజయనగరం మండలం గుంకలాం జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన గృహాలకు విద్యుత్ సౌకర్యం అందించేందుకు ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షల నగదును అందించడం ఆనందంగా ఉందన్నారు. పట్టణ పేదలకు గుంకలాం, కొండకరకాం, జమ్ము, సారిక ప్రాంతాల్లో వందల ఎకరాల్లో సుమారు 20 వేల ఇళ్ల పట్టాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. ఒక వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవినీతిరహిత పాలన సాగిస్తున్నారని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ వి.వి జయలక్ష్మి, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్ ఎం.లయా యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, డీఈ పి.హరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కొప్పెర్ల విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడగా.. నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులు ఎ. రాజు, బి.హరి, పి.జస్వంత్, జి. నిఖిల్‌బాబు ఫిబ్రవరి 7,8,9 తేదీలలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, పీడీ కృష్ణ, పీఈటీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదాతలే ప్రాణదాతలని ఏపీజే అబ్దుల్ కలాం బ్లడ్ డోనర్స్ క్లబ్ సలహాదారుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక న్యూలైఫ్ బ్లడ్‌సెంటర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పురుషులతో పాటు మహిళలు కూడా రక్తదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, గోవింద్, సయ్యద్ తాజ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లకు బదిలీ

విజయనగరం: మున్సిపల్ శాఖ పరిధిలోని వివిధ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న కమిషనర్‌లు, అసిస్టెంట్ కమిషనర్‌లకు బదిలీ అయింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కమిషనర్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డి శ్రీరాములనాయుడును మాతృశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో విశాఖ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.మల్లయ్యనాయుడును నియమించారు. విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.వి.డి.ప్రసాదరావును గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా నియామకంకాగా, ఆయన స్థానంలో ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యదర్శి సీహెచ్ తిరుమలరావు అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.

- బొబ్బిలి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను విశాఖ జీవీఎంసీకి బదిలీ చేయగా ఆయన స్థానంలో విశాఖ జీవీఎంసీలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎల్.రామలక్ష్మిని నియమించారు.
- బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సీహెచ్ సత్యనారాయణ నియామకమయ్యారు.
- పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జె.రామప్పలనాయుడును రాజాం బదిలీ చేయగా, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.సింహాచలంను అక్కడకు బదిలీ చేశారు.
- సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా గ్రేటర్ విశాఖ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకటరమణ బాధ్యతలు చేపట్టనున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



మృతురాలి ఇంటి దగ్గర సిబ్బందితో కలిసి విచారణ చేపడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

భోగాపురం: మండలంలోని మహరాజుపేట గ్రామానికి చెందిన ముద్దాడ అప్పయ్యమ్మ(76) తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పయ్యమ్మ భర్త కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా మహరాజుపేట గ్రామంలో నివాసముంటోంది. రోజూ పగటిపూట బయటకు వచ్చి తిరిగే అప్పయ్యమ్మ శుక్రవారం ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చి రాజాపులోవలో ఉన్న ఆమె కుమార్తె నల్ల గంగమ్మకు సమాచారం అందించారు. దీంతో ఆమె మహరాజుపేట గ్రామానికి చేరుకుని తన తల్లి ఇంటి తలుపులు తెరిచి చూడగా అప్పయ్యమ్మ శవమై కనిపించింది. ఆమె ఒంటి మీద ఉన్న సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు (గాజులు, గొలుసు) కనిపించకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, అక్కడినుంచి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత



నారాయణమ్మకు ట్రై మోటార్ సైకిల్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ పరిధిలో విధులు నిర్వహిస్తూ పదోన్నతులు పొందిన ఉద్యోగులు, కారుణ్య నియామకాల్లో భాగంగా ఉద్యోగం పొందిన వారికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. కారుణ్య నియామకంలో బి.రమ్యశ్రీకి ఎల్.కోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో, బొత్స హరితకు చింతాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ సహాయకులుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అలాగే పదోన్నతులు పొందిన ఎల్.ముఖేశ్వరరావును సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో, డి.దుర్గాప్రసాద్‌ను పార్వతీపురం పీఐయూ డివిజన్‌లో టైపిస్టులుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. రాజాన భారతిని ఉద్దవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల కార్యాలయం సహాయకురాలిగా నియామకపత్రం అందజేశారు. ఆఫీస్ సబార్డినేట్లుగా విధులు నిర్వహిస్తున్న కె.రమేష్‌కుమార్‌ను పూసపాటిరేగ ఎంపీడీవో కార్యాలయంలో, బి.అఖిల్‌కుమార్‌ను పార్వతీపురం పీఆర్ఐ డివిజన్‌లో టైపిస్టులుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రై మోటార్ సైకిల్ పంపిణీ

తెర్లాం మండలం నందబలగలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న వికలాంగురాలు ఎం.నారాయణమ్మకు జెడ్పీ నిధుల నుంచి కొనుగోలు చేసిన రూ.1.2 లక్షలు విలువ చేసే ట్రై మోటార్ సైకిల్‌ను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు జెడ్పీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, బొబ్బిలి, గంట్యాడ జెడ్పీటీసీ సభ్యులు ఎస్.శాంతకుమారి, వర్రి నరసింహమూర్తి, అధికారులు, జెడ్పీ కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి'

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 30న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం రమణ, అరుణ, సీసీలు, వీఓలు, వీఏఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండంలోని 22 పంచాయతీలకు చెందిన డ్వాక్రా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాల, సారికలోని ఎంపీయూపీ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఎంపీపీ అప్పలనాయుడు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, జొన్నవలస గ్రామ సర్పంచ్ కంది రమాదేవి, జొన్నవలస పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మజ్జి అప్పారావు, జొన్నవలస, సారిక పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు అభినందనల జల్లు



ఆరాధ్యుల శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ డీఐజీ

విజయనగరం క్రైమ్: సీఆర్‌పీఎఫ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న ఆరాధ్యుల శ్రీనివాస్‌కు ప్రెసిడెంట్ పోలీస్‌మెడల్‌కు ఎంపిక చేస్తూ కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. 1991లో సీఆర్‌పీఎఫ్‌లో చేరిన శ్రీనివాస్ భారతదేశమంతటా విధులు నిర్వహించారు. జమ్మూకాశ్మీర్, నార్త్ ఈస్ట్, నక్సల్స్ ఎఫెక్టెడ్ ఏరియాస్‌లో పనిచేశారు. 2013లో మెరిటోరియస్ సర్వీసెస్ అవార్డు కైవసం చేసుకున్నారు. విజయనగరానికి చెందిన శ్రీనివాస్ ప్రస్తుతం హైదరాబాద్‌లో సెటిలయ్యారు. ఆయనకు స్థానికులు అభినందనలు తెలిపారు.

వచ్చేనెల 4న వ్యాకులమాత యాత్ర



కొండదాబాల చర్చిలో దివ్యబలి పూజను నిర్వహిస్తున్న ఫాదర్స్

కొత్తవలస: మండలంలోని కొండదాబాల వ్యాకులమాత యాత్ర ఫిబ్రవరి 4న జరగనుందని ఆ క్షేత్ర విచారణకర్త గురుశ్రీ డాక్టర్ గొంగాడ రాజు తెలిపారు. వచ్చేనెల 2వ తేదీ వరకు జరగనున్న నవదిన పూజాప్రార్థనలో భాగంగా దివ్యబలిపూజను శుక్రవారం ప్రారంభించారు. ఫాదర్ వై.వి.రమేష్ పతావిష్కరణ చేశారు. ఫాదర్ ప్రభాకర్, వేళాంగిణి, జోజయ్య, గొంగడ రాజు, వై.వి.రమేష్‌లు అతిపరిశుద్ధ దివ్య బలి పూజను సమర్పించారు.

సీబీసీఎన్‌సీ పటిష్టతకు కృషి

విజయనగరం టౌన్: ది కన్వెన్షన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చ్స్ ఆఫ్ నార్తరన్ సర్కార్స్ (సీబీసీఎన్‌సీ) పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీబీఎన్‌సీ సంఘ అధ్యక్షుడు ఎంఏ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో సీబీసీఎన్‌సీ 69వ సార్వజనీన మహాసభ ఘనంగా నిర్వహించారు. సోంపేట నుంచి అవనిగడ్డ వరకు ఉన్న బాప్టిస్ట్ రాయబారులు పాల్గొని సందేశాలను వినిపించారు. సంఘ కార్యదర్శి కుమార్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఆర్.ఎస్.జాన్, ఆనంద్ రత్నకుమార్, వెస్లీ, మోజెస్, ఎలీషా, తాలాడ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామ మాజీ సర్పంచ్ కురిమినేని గురునాయుడు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా, ఒక సారి ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేసి గ్రామానికి విశేష సేవలందించారు.

సీఎం సభను విజయవంతం చేయండి

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి



మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి, శ్రీరాములనాయుడు

నెల్లిమర్ల: విశాఖ జిల్లా భీమిలి మండలం సంగివలస వద్ద శనివారం నిర్వహించనున్న సీఎం సభను (ఎన్నికల శంఖారావం) విజయవంతం చేయాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి భీమిలిలో సభ నిర్వహిస్తున్నారని చెప్పారు.

పీటీసీలో నూతన భవనాలు ప్రారంభం



నూతన భవనాలను ప్రారంభిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు

విజయనగరం క్రైమ్: పోలీస్ శిక్షణ కళాశాలలో కొత్తగా నిర్మించిన కానిస్టేబుల్ బ్యారెక్, డ్రెస్సింగ్ రూమ్‌లతో పాటు లార్డ్ బుద్ధ విగ్రహాలను పీటీసీ ప్రిన్సిపాల్ టి. ఆనందబాబు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, డీఎస్పీలు సీహెచ్‌వీ రామారావు, వీవీ అప్పారావు, టి.భవానీ, డాక్టర్ ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

313 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైమ్: స్థానిక అశోక్‌నగర్ సమీపంలో మద్యం విక్రయిస్తున్న మహిళను టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 313 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై రాజేష్, ఏఎస్ఐ పైడితల్లి, శ్రీను, తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న ఇద్దరి అరెస్ట్

మండల పరిధిలోని జొన్నవలస గ్రామం శివారులో కోడిపందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను రూరల్ ఎస్సై వాసుదేవ్ శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.11వేల 200 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామ శివారులో బెల్టు షాపుకు అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా మద్యం తరలిస్తూ పట్టుబడిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 100 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రామగణేష్ తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే తమకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

- ఎంపీపీ కల్యాణి



వీఆర్‌ఓ రామకృష్ణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న తహసీల్దార్ భాస్కరరావు

పూసపాటిరేగ: అంకిత భావంతో విధులు నిర్వహించిన తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల స్థాయిలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ శాఖలకు చెందిన 16 మందికి ఆమె అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీడీఓ జి.రాధిక, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, వ్యవసాయ అధికారి కె.నీలిమ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, టొంపల సీతారాం, తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి ఉత్తమ సేవలు అందించిన నలుగురు బీఎల్‌ఓలకు తహసీల్దార్ భాస్కరరావు అవార్డులు అందజేశారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. వెండి మంటపంలో ఉన్న సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణ నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో ఉంచారు. అనంతరం దీపాలు వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జెడ్పీ సీఈఓ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సిద్ధికి కృషిచేసిన మహనీయుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. త్రివిధ దళాల్లో ప్రాణాలకు తెగించి దేశ రక్షణకు కృషిచేస్తున్న సైనికుల సేవలను ఆయన కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అన్ని సామాజిక వర్గాలకు అందాలన్న రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. ఉత్తమ అవార్డులకు ఎంపికైన జెడ్పీ సీఈఓ, పంచాయతీరాజ్ ఎస్ఈ గుప్త, ఇతర జెడ్పీ సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిచర్ల బాపూజీనాయుడు, బొబ్బిలి, గంట్యాడ జెడ్పీటీసీ సభ్యులు ఎస్.శాంతకుమారి, వర్రి నరసింహమూర్తి, పీఆర్ ఈఈ కేజీజే నాయుడు, డీపీఓ శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

'సిద్ధం' సభను జయప్రదం చేయండి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్

రాజాం: భీమిలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పిలుపునిచ్చారు. రాజాం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్‌తో కలిసి రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పార్టీ శ్రేణులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్రపై ఉంచిన నమ్మకాన్ని, చేసిన అభివృద్ధికి నిదర్శనంగా పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్మోహనరావులు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, యూత్ అధ్యక్షులు వంజరాపు విజయ్‌కుమార్, గెడ్డాపు అప్పలనాయుడులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు పాల్గొన్నారు.